హనుమాన్ ప్రాజెక్టును పటిష్ట పరచాలి

- మియావకీ తరహా ప్లాంటేషన్‌కి శ్రీకారం
- ఏనుగుల క్యాంపును ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ముసలిమడుగు ఏనుగుల క్యాంపును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి- పలమనేరు: అటవీశాఖ ఆధ్వర్యంలో పలమనేరు మండలం ముసలిమడుగులో ఏర్పాటు చేసిన నూతన ఏనుగుల క్యాంపును ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలా ఫలకాన్ని ప్రారంభించారు. అలాగే ఏనుగుల క్యాంపులో ఏర్పాటు చేయనున్న గజారామం నగరవనానికి పునాదిరాయి వేశారు. సౌర శక్తితో పనిచేసే వేలాడే అటవీ ఏనుగుల నిరోధక కంచె నిర్మాణానికి కూడా పునాది రాయి వేశారు. జిల్లాలో ఒకరోజు పర్యటన భాగంగా ఉప ముఖ్యమంత్రికి హెలిపాడ్ వద్ద జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు చిత్తూరు గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు మురళీమోహన్, చూడ చైర్మన్ కటారి హేమలత, జిల్లా ఎస్పీ తుషార్ దూడి, డీఎఫ్ఓ సుబ్బరాజు స్వాగతం పలికారు. అనంతరం హనుమాన్ ప్రాజెక్ట్ అంశంపై లైన్ డిపార్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, వన్యప్రాణుల అదనపు అధికారి శాంతిప్రియ పాండే, అటవీ సంరక్షణ అధికారి అనంతపురం సర్కిల్ ఆర్.యశోదబాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏనుగుల వలన ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలి అని తెలిపారు. అడవి ఏనుగులను మార్గనిర్దేశం చేయడానికి, నియంత్రించడానికి, సురక్షితంగా అడవికి తరిమికొట్టడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన కుంకి ఏనుగులు అవసరాన్ని అటవీశాఖ గుర్తించిందని తెలిపారు. 2020-21, 2024-25 మధ్య చిత్తూరు-పలమనేరు-కుప్పంలో ఏనుగుల దాడి కారణంగా 23 మంది ప్రాణాలు, 34 పశువులు మరణించాయని, 4,000 ఎకరాలకు పైగా పంటలు నాశనమయ్యాయి, మొత్తం పరిహారం చెల్లింపు రూ.426 లక్షలకు మించిపోయిందని తెలిపారు. అటవీప్రాంతం అంచున ఉన్న అనేక గ్రామాలకు, ఈ సంఘర్షణ రోజువారీ జీవితంలో ఒక భాగమైందన్నారు. రైతులు తమ పంటలను రక్షించుకోవడానికి రాత్రిపూట మేల్కొని ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే 21న శిక్షణ పొందిన నాలుగు కుంకి ఏనుగులు కృష్ణ, అభిమన్యు, దేవ, రంజన్ కర్ణాటక నుండి రప్పించి ముసలిమడుగులో ఉంచి వాటికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే అదనంగా రెండు రాష్ట్ర ఏనుగులు జయంత్, వినాయక్‌లను నవియాల ఏనుగు శిబిరం నుండి బదిలీ చేశారని తద్వారా తక్షణ క్షేత్రస్పందన సామర్థ్యం గల ఆరు ఏనుగుల బృందాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హనుమాన్ ప్రాజెక్టు లైన్ డిపార్ట్మెంట్లో అందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం శిక్షణలో కుంకీ ఏనుగులు చూపుతున్న మెలకువలు, ఇటీవల జరిగిన ఆపరేషన్ల తీరును అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కుంకీ ఏనుగులు ప్రత్యేకంగా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. క్రమబద్ధంగా కుంకీ ఏనుగులు వరుసగా వస్తూ ఘీంకారం చేస్తూ పవన్ కళ్యాణ్‌కి సెల్యూట్ చేశాయి. అనంతరం అడవిలో లభ్యమయ్యే వివిధ రకాల కలపను ఏనుగుల సహాయంతో ఎలా బయటకు తీసుకువచ్చేది ఏనుగుల చేత ప్రదర్శింపజేశారు. మానవ, ఏనుగుల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు మదపుటేనుగుల గుంపు, నివాసాలు, పంట పొలాల వైపు వస్తున్నప్పుడు వాటిని ఎలా నియంత్రించాలో ప్రత్యక్షంగా కుంకీ ఏనుగుల చేత చేయించిన ప్రదర్శన ఆకట్టుకుంది. మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ఓ ప్రత్యేకంగా మత్తు ఇచ్చి వాటి కోపాన్ని ఎలా అణిచి వేస్తారన్నది మావటీలు పవన్ కళ్యాణ్‌కి చూపించారు. మత్తు ఇచ్చే ఇంజెక్షన్ గన్‌ను ఆయన ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఏనుగులకు ఆయన స్వయంగా బెల్లం తినిపించి ఆశీర్వచనం అందుకున్నారు.

మియావకీ తరహా ప్లాంటేషన్‌కి శ్రీకారం

తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ మొక్కలు పెంచడం ద్వారా అడవిని పెంపొందించే మియావకీ తరహా ప్లాంటేషన్‌కు, ముసలమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ కేంద్ర వద్ద పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. 250 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్లాంటేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా డిప్యూటి సిఎం ఉసిరి మొక్కను నాటి ఈ దట్టమైన అడవుల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీటరకు ఒక్కటి చొప్పున నాటిన మియావకీ ప్లాంటేషన్‌ను స్వయంగా మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. మధ్యన పొదలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి కుంకీ ఏనుగులను స్వీకరించేటప్పుడు వీటిని జాగ్రత్తగా చూసుకుంటామని చెప్పామని, ఆ విధంగానే పలమనేరు ఎలిఫెంట్ క్యాంపులో మావటీలు కుంకీల సంరక్షణ బాధ్యతలు చూసుకుంటున్నారని వారి పనితీరు మెచ్చుకుంటూ పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులు రూ.50 వేలు మావటీలకు బహుమానంగా అందించారు.



ఏనుగుల విన్యాసాలను తిలకిస్తున్న డిప్యూటీ సిఎం

పవన్ పర్యటనలో అపశృతి.. గాయపడి మహిళ..

పలమనేరులో ముసలిమడుగు ఎలిఫెంట్ హబ్‌కు విచ్చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాన్వాయ్ అడ్డు తగలడంతో పలువురికి గాయాలయ్యాయి. పవన్‌కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా చూడాలని వచ్చిన అభిమానులకు పవన్ బయటకు వచ్చి కనిపించకపోవడం, కాన్వాయ్ ఆపకపోవడంతో నిరాశచెందారు. అతనికి హారతి ఇవ్వాలని ఉద్దేశంతో విచ్చేసిన మహిళలు ఒక్కసారిగా అడ్డుగా రావడంతో పలువురికి గాయాలయ్యాయి. వెంటనే వారిని పలమనేరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించడం జరిగింది. అలాగే సెప్టెంబర్‌లో ఒంటరి ఏనుగు దాడిలో గాయపడిన ఫారెస్టు అధికారి సుకుమార్ డిప్యూటి సిఎంను కలిసేందుకు వచ్చి దాదాపు 5గంటలు వేసి ఉన్నా నిరాశే మిగిలింది. ఏనుగుల దాడిలో గాయపడిన వారినికూడా పరామర్శించకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.

డిప్యూటి సిఎం పర్యటనలో అపశృతిపై కలెక్టర్ వివరణ

డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ముసలిమడుగు పర్యటనలో అపశృతి.. మహిళ కాలిపై దూసుకెళ్లిన పవన్ కళ్యాణ్ కారు.. అని వివిధ ప్రసార మాధ్యమాలలో వస్తున్న ప్రతికూల వార్తపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వివరణ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి పలమనేరు మండలంలో ముసలిమడుగు పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంపై వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. కాన్వాయ్ వెళ్లే దారిలో ఉన్న మహిళ జనాల తాకిడికి తోపులాటలో హేమలత అనే మహిళ స్పృహతప్పి కిందపడిపోగా తొక్కిసలాటలో ఎడమ కాలికి గాయమైందన్నారు. వెంటనే ఆమెను పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆర్థోపెడిషియన్ పర్యవేక్షణలో అన్ని పరీక్షలు నిర్వహించామన్నారు. ఎడమ కాలికి చిన్నపాటి గాయమైందని, ఆరోగ్యం నిలకడగా ఉందని, మెరుగైన వైద్య చికిత్స అందించడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా సహాయ సహకారం అందిస్తుందని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 10వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 10వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్‌సెల్

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 10వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ దూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

కమిషనర్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో 10వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

పిజిఆర్ఎస్ వాయిదా: కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం

కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 10వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వినాయకుని సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర నూతన దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఏఈఓలు రవీంద్రబాబు, ధనపాల్ వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు. అలాగే 10 మంది రష్యన్ దేశస్తులు స్వామివారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు, వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాటు చేశారు.

వినాయక స్వామివారి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లోకాయుక్త రజిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట ఐరాల ఎమ్మార్వో లోకేశ్వరి, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణంలోని రెండు వసతి గృహాలను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని గుడియాత్తం రోడ్డులో గల ఎస్సీ బాలుర హాస్టళ్ళను తనిఖీశె ఏసి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం మెనూ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అక్కడ అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఈ మధ్య కురిసిన వర్షాలకు హాస్టల్ ఆవరణలో సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయని విద్యార్థులను అడిగారు. దోమల బెడదతో పాటు చలి తీవ్రతకు చేపట్టిన చర్యలపై హాస్టల్ వార్డెన్‌ను అడిగారు. అనంతరం విద్యార్థులకు ఆయన దుప్పట్లను అందజేశారు. పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వి.బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, కూటమి నాయకులు ఖాజా, బిఆర్సి.కుమార్, నాగరాజు రెడ్డి, పసుపులేటి దిలీప్ కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

కార్పెంటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ సమావేశం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భారతి కార్పెంటర్స్‌కి గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్పెంటర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషిచేనున్నట్లు తెలిపారు. ఇతర సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం అసంఘటిత రంగకార్మికులకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను అందించేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య మాట్లాడుతూ ఆ సంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్పెంటర్స్ తమ వృత్తి నైపుణ్యంతో పనిచేస్తున్నారని, వారి సమస్యలపై పోలీసు వ్యవస్థ అండగా ఉంటూ సహకరిస్తుందన్నారు. ఈ సమావేశంలో విశ్వకర్మ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గురునాథం, కార్యదర్శి జయకుమార్, ఉపాధ్యక్షులు ఎం.సంజీవి, కే.ఆనంద్ లతోపాటు పలువురు కార్పెంటర్స్ పాల్గొన్నారు.

కుప్పంతో సమానంగా వీకోట అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- వీ.కోట: కుప్పం నియోజకవర్గంతో సమానంగా వికోట మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం ఆదివారం వీకోటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్దపెట్ట వేస్తోందన్నారు. గతంలో కుప్పంలో భాగమైన వీకోట మండలంలోని కొన్ని పంచాయతీలు అభివృద్ధిలో శరవేగంగా దూసుకెళ్లాయన్నారు. అయితే నియోజకవర్గాల పునర్ విభజనలో భాగంగా వీకోట మండలంలోని అన్ని పంచాయతీలు పూర్తిగా పలమనేరు నియోజకవర్గంలో చేరడంతో అభివృద్ధి కొంతమేర మందగించిందన్నారు. పలమనేరు నియోజకవర్గం పూర్తిస్థాయిలో కాకపోయినా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కుప్పని ఆనుకుని ఉన్న వీకోట మండలాన్ని కూడా కుప్పంతో సమానంగా ముఖ్యమంత్రి అభివృద్ధి చేసే విధంగా పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ కృషి చేయాలని సూచించారు. బిఆర్.రాంబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ మండల నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే సమక్షంలో ఘనంగా జరిగింది. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కొత్త కార్యవర్గం కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. అందరి సమన్వయంతో పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన ప్రెసిడెంట్ రాంబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా చైర్మన్ సురేష్ బాబు, బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్వి.బాలాజీ, రాష్ట్ర వేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ గజేంద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ రామచంద్ర నాయుడు, శబరిష్, ధీరజ్, ఏఆర్ నాగరాజు పాల్గొన్నారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించాలి

యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

రాష్ట్రంలో వివిధ రకాల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ లేకపోవడం వలన చాలా రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వెంటనే 73, 74 జీవోలు ప్రకారం ఉమ్మడి సర్వీసులు కల్పించాలని యుటిఎఫ్ జిల్లా కార్యవర్గం డిమాండ్ చేసింది. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్ నాయుడు అధ్యక్షతన ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు జీవీ.రమణ మాట్లాడుతూ సర్వీస్ రూల్స్ లేకపోవడం వలన డీఈఓ, డిప్యూటీ డీఈఓ వంటి క్రియాశీలకమైన పాఠశాలలో తనిఖీ చేయాల్సిన పోస్టులలో ఒక ఉపాధ్యాయుడు ప్రమోషన్ పొందకపోవడం శోచనీయమన్నారు. జీవో 243 రద్దు చేయడం వలన జూనియర్ లెక్చరర్ పోస్టులలో ఉపాధ్యాయులకు ప్రమోషన్ కల్పించడం లేదని, నాన్ టీచింగ్ సిబ్బందికి జూనియర్ లెక్చరర్‌గా ప్రమోషన్లు కల్పించడం, అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అవకాశం కల్పించకపోవడం అసంబద్ధమని అన్నారు. అదేవిధంగా పాఠశాల విద్యలో క్రియాశీలకంగా ఉన్న ఎంఈఓ 1 నియమకాల్లో సర్వీస్ రూల్స్ లేక 400 పైగా మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు లేకుండగానే విద్యా సంవత్సరం పూర్తయిపోతుందని, వెంటనే ఉమ్మడి సర్వీసులు ఏర్పాటు చేసి విద్యారంగ పటిష్టతకు తోడ్పడాలని డిమాండ్ చేశారు. అలాగే టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. 2010కి ముందు నియమించబడ్డ ఉపాధ్యాయులను ఐదు సంవత్సరాలకి మించి సర్వీసు ఉంటే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పాస్ కావాలనే సుప్రీంకోర్టు ఉత్తర్వుల నుండి ఉపాధ్యాయులను మినహాయించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. డీఎస్సీ రాసి ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు నేడు టెట్ పాస్ కావాలని నిబంధనను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర,రాష్ట్ర మానవరుల శాఖలను కోరుతున్నామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర్ నాయుడు, ఎస్.మనిగండన్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ తరువాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీగా ఉన్న 1043 ఉపాధ్యాయ పోస్టులను ఉద్యోగోన్నతలు, డీఎస్సీ ద్వారా వెంటనే ఏర్పాటు చేయాలని అంతవరకు విద్యా వాలంటీర్ల ద్వారా విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు కె.రెడ్డప్ప నాయుడు, ఎస్.రెహానా బేగం, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్పీ బాషా, జిల్లా కార్యదర్శులు ఏ.కృష్ణమూర్తి, కె.సరిత, ఎం.పార్థసారథి, పి.సురేష్, కె.గణేష్ కుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు జీవీ రమణ

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

బకాయిలు చెల్లించని మామిడి గుజ్జు పరిశ్రమల యాజమాన్యం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని ఎస్టియు కార్యాలయంలో ఆదివారం మామిడి రైతుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా కమిటీకార్యవర్గ సమావేశం హేమలత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మామిడి రైతులు కలవడానికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా గుజ్జు పరిశ్రమల బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమని, గుజ్జు పరిశ్రమల యాజమాన్యం ప్రభుత్వం ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవరిస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని తప్ప చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈనెల 20వ తేదీ లోపల గుజ్జు పరిశ్రమలు మామిడి రైతులకు రూ.8లు చెల్లించకుంటే క్షేత్రస్థాయి నుంచి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులకు తోతాపురి గిట్టుబాటు ధర రూ.12లు ప్రకటించిందని, ప్రభుత్వం ఆలస్యంగానైనా రూ.4లు చెల్లించగా పరిశ్రమల యాజమాన్యం ఇప్పటి వరకు రూ.8లు అందించలేదని, దీనిపై ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం చూస్తుంటే రైతులపై ప్రభుత్వానికి ఎంత శ్రద్ధ ఉందో ఇటే అర్థమవుతోందన్నారు. వెంటనే పరిశ్రమల నుంచి రైతులకు రావల్సిన బకాయిలు అందించేలా ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నం, సంజీవరెడ్డి, భారతమ్మ, శ్రీనివాసులు, మోహన్ రెడ్డి, త్యాగరాజుల రెడ్డి, ఉమాపతి నాయుడు, పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం!

- మనుగడకు విఘాతం
- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పెరిగిపోతున్న వ్యర్థాలు

ప్రజాశక్తి -విజయపురం (నగరి)

పట్టువదలని విక్రమార్కుడి భుజంపై మళ్లీ మళ్లీ ఎక్కే బేతాళుడిలా ప్లాస్టిక్ అందరిపైనా స్వారీ చేస్తోంది. ప్లాస్టిక్ నిషేధం ఉత్తర్వులు ఎక్కడా పూర్తి స్థాయిలో అమలైన జాడ కనిపించడంలేదు. దీంతో ప్లాస్టిక్ సమస్యలు నానాటికీ పెరిగిపోతున్నాయి. డ్రెయినేజీలలో వచ్చే పూడికల్లో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించాలనే ప్రభుత్వ ఆదేశాలు రికార్డులకే పరిమితమయ్యాయి.

ఆగని ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు

నియోజకవర్గ పరిధిలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో అధికారులు ఆకస్మిక దాడులు చేస్తూ ప్లాస్టిక్ విక్రయించే వారిపై భారీగా జరిమానాలు విధించేవారు. కొంతకాలానికి అధికారులు మౌనంగా వుండడంతో మళ్లీ కొందరు ప్లాస్టిక్ విక్రయాలు మొదలుపెట్టారు. హ్యాండ్లింగ్ ప్లాస్టిక్ కవర్స్ వేస్ట్ మేనేజ్మెంట్ 2011 నిబంధనల ప్రకారం మండల పంచాయతీ కార్యదర్శులు వ్యాపార దుకాణాలు, మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుంటే చర్యలు తీసుకోవాలి. అక్కడికక్కడే వాటిని వినియోగిస్తున్న వారిపై జరిమానాలు విధించి వాటిని స్వాధీనం చేసుకొని నాశనం చేయాల్సి వుంది. అయితే ఆ నిబంధనలు పటిష్టంగా అమలు కావడంలేదు. రీసైక్లింగ్ కూడా జరుగుతుం డటంతో పర్యావరణానికి చాలా ప్రమాదకరమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ అవగాహన లోపంతో ప్రజలు వీటిని యథేచ్ఛగా వినియోగిస్తున్నారు.

వినియోగదారులు మారాలి

కవర్లు లేవని నిబంధనలతో వినియోగించడం లేదని దుకాణదారులు చెబుతుంటే ఎలాంటి సంచులు తీసుకురాని వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులను వదిలి వెళ్లిపోతున్నారు. ఏ దుకాణంలో కవర్లు వేసి ఇస్తున్నారో అక్కడ కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో దుకాణదారులు మళ్లీ కవర్లను విక్రయించే పరిస్థితికి చేరుకుంటున్నారు. ఏ దుకాణంలో ఎటు చూసినా, ఏ హోటల్‌లో చూసినా, ఏ చెత్తకుప్పలో చూసినా ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. గతంలో చెత్తలో కేవలం ఐదు శాతం కంటే తక్కువ ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తుంటే ప్రస్తుతం 30 నుంచి 40 శాతం వరకు ఇవే ఉంటున్నాయి. కాలువల్లో చేరే చెత్తకుప్పలోనూ ఇవే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా వినియోగదారుల్లో మార్పు రాకుంటే పర్యావరణం ప్రమాధకరంగా మారండం ఖాయమని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు 10 మంది ఎంపిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్ -14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం చిత్తూరులోని మెసానికల్ క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -14 విభాగం పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు బాబు, శారదల ఆధ్వర్యంలో జరిగాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. బాలబాలికల విభాగంలో ఆటగాళ్లకు వేర్వేరు కోర్టుల్లో పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడే తుది జట్లను ఖరారు చేశారు. ఈ క్రమంలో బాలల విభాగంలో చిత్తూరు జిల్లాకు చెందిన ఆర్వీ తేజస్, జీ.నితీష్, పీఎస్.శశాంక్, తిరుపతికి చెందిన సీ.హరిసోనాల్, కే.మోత్విక్ ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అదే విధంగా బాలికల విభాగంలో చిత్తూరుకు చెందిన బి.మోక్షిత, తిరుపతికి చెందిన పీ.అయేస్నా, ఏ.సిరిచందన, వీ.గుహిక, బి.పూజిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారి జాబితాలో ఉన్నారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు బాబు, శారద మాట్లాడుతూ జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ చాటిన బాల, బాలికల క్రీడాకారులు ఈనెల 25 వ తేదీన గన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడనున్నారని వెల్లడించారు. ఇదిలా ఉండగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాల బాలికలను సహచర క్రీడాకారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ (డిఎస్ఎ) షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ గోపిరెడ్డి పాల్గొన్నారు.

దారి చూడని బతుకులు!

- వర్షం వస్తే చెక్ డ్యాంపై వెళ్లాల్సిందే..
- ప్రమాదమని తెలిసినా విధిలేని పరిస్థితి
- సమస్యలతో యానాదులు సతమతం

ప్రజాశక్తి -పలమనేరు రూరల్ (గంగవరం): స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు దాటినా గ్రామీణ ప్రాంతాలు ఇంకా అభివృద్ధికి నోచుకోవడంలేదు.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని పదేపదే ప్రభుత్వాలు చెబుతున్నా గ్రామ ప్రాంతాల యానాదుల బతుకులు ఇంకా మారలేదు. వర్షం వస్తే నది నీళ్లు గ్రామానికి దారి లేకుండా చేస్తున్నాయి. దీంతో చెక్ డ్యాం, వంక కాలువ దారుల మీదుగా నడిచి వెళ్లాల్సి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటోంది.. మండలంలోని పెంగరగుంట పంచాయతీ, మొసలి మడుగు గ్రామ సమీపంలోని ఏటిగడ్డ యానాది కాలనీ వాసులు భారీ వర్షంతో నది వరద వస్తే ఎదుర్కొంటున్న కష్టాలే ఇందుకు తార్కాణం..

దారి చూడని బతుకులు

ఇటీవల కురిసిన వర్షానికి కౌండిన్య నది నీటి ప్రవాహం అధికం కావడంతో మండలంలోని యానాది కాలనీ వారితో పాటు పలు గ్రామాల ప్రజలు ప్రమాదమని తెలిసినా విధిలేని పరిస్థితిలో ప్రవహిస్తున్న వాగుల్లోనూ, చెక్ డ్యాంలపైన నది దాటి వెళ్లాల్సి వచ్చింది. కౌండిన్య నదిలో బ్రిడ్జి లేని కారణంగా చెక్ డ్యాం, వంక కాలువల మీదుగా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది..

వర్షం వస్తే చెక్ డ్యాంపై వెళ్లాల్సిందే..

నీటి కాలువను దాటి వెళుతున్న ఏటిగడ్డ గ్రామ వాసులు

పెంగరగుంట పంచాయతీ మొసలి మడుగు గ్రామ సమీపంలోని కౌండిన్య నదికి ఇరువైపులా ఉన్న పలు గ్రామాల ప్రజలకు, ఏటిగడ్డ యానాదులకు , రైతులకు ఏళ్ల తరబడి బ్రిడ్జితో పాటు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో నదిని దాటి మొసలి మడుగు గ్రామానికి వెళ్లలేక పోతున్నారు. ఈ గ్రామాలకు మధ్య గతంలో కౌండిన్య నదికి చెక్ డ్యాం నిర్మించారు. ఇటీవల ఈ నదిలో నీరు భారీగా ప్రవహించడం వల్ల నదిని దాటి వెళ్లని పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని సంవత్సరాలుగా వర్షాకాలంలో రాకపోకలు లేక కృష్ణాపురం మీదుగా 15 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి వస్తోంది. ఏటి గడ్డ గ్రామంలో యానాదులకు చెందిన 70 కుటుంబాలు, ఇతర బీసీ కుటుంబాలు, 80 శాతం పైన రైతు కుటుంబాలు వుంటున్నాయి. ఈ గ్రామాలకు సమీపంలో మరికొన్ని గ్రామాల ప్రజలు మొసలి మడుగు గ్రామం మీదుగా అటు తమిళనాడుకు, ఇటు పలమనేరుకు వెళ్లాలన్నా,

చెక్ డ్యాంలపై వెళ్లలేకపోతున్నాం..

మా యానాది కాలనీలో చాలా మంది చిన్న పిల్లలు కౌండిన్య నదిలో భారీగా నీరు ప్రవహిస్తున్న కారణంగా నెల రోజులు గా చెక్ డ్యాం మీదుగా వెళ్లలేక పోతు న్నారు. పెద్దవాళ్లు మాత్రం కొందరు ఏటి గడ్డ నుంచి సముద్ర పల్లి మీదుగా పలమనేరుకు వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరం వెళ్లి రావడానికి వంద రూపాయలు ఖర్చు పెట్టుకుని వెళ్లాలి..ఆ వంద రూపాయలు ఉంటే పిల్లలకు ఆరోగ్య ఖర్చులకు ఉపయోగపడుతుంది. మా యానాదుల తో పాటు ఇక్కడున్న వందల కుటుంబాల వారందరికీ రాకపోకల నిమిత్తం వెంటనే బ్రిడ్జి నిర్మించాలి..

- యానాది రోజా, యానాది కాలనీ.

మొసలి మడుగు గ్రామానికి నేరుగా రావాలన్నా అర్ధ కిలోమీటరు దూరం మాత్రమే వుంది. ప్రస్తుతం కౌండిన్య నదిలో నీరు ఉన్న కారణంగా ఏటి గడ్డ యానాదుల కాలనీతో పాటు సమీప గ్రామాల్లోని చిన్న పిల్లలు చదువుకునే చాలా మంది నిరుపేద విద్యార్థులు స్కూలుకు వెళ్లలేక ఇళ్లవద్దే వుంటున్నారు. ఏటికి ఇరువైపులా అనేక గ్రామాల ప్రజలు, రైతులు ఈ నదికి ఇరువైపులా ఉన్న వ్యవసాయ భూములకు నిత్యం వెళ్లాలన్నా ఈ దారిలోనే వెళ్లాలి..ఈ దారిలో కౌండిన్య నది నీరు భారీగా నీరు ప్రవహించడం వల్ల చుట్టుపక్కల మరికొన్ని గ్రామాల ప్రజలు, రైతులు వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, కూరగాయలు, పాలు, నిత్యావసరాల తెచ్చుకునేందుకు వెళ్లేవారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అనారోగ్యం కారణం గా ఆస్పత్రికి వెళ్లాలన్నా, రేషన్‌కు వెళ్లాలన్నా చుట్టుపక్కల

పాచిపట్టిన చెక్ డ్యాంపైనే వెళ్లాలి

మా యానాది కాలనీలో ఉన్న వారు గర్భిణులు, పిల్లలు వయోవృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు ఆస్పత్రికి వెళ్లాలంటే కౌండిన్య నదిలో నీరు భారీగా ప్రవహించడం వల్ల వెళ్లలేక పాచి కట్టిన చెక్ డ్యామ పైనే వెళ్లాల్సి వస్తోంది. ఎక్కడ జారుతుందో తెలియక మెల్లగా మొసలి మడుగు గ్రామానికి వెళుతున్నాం..మాకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి..

- యానాది కాంతమ్మ, ఏటి గడ్డ గ్రామం.

వారంతా మొసలి మడుగు గ్రామానికి చేరుకుని రోడ్డు మార్గం ద్వారా పలమనేరుకు వెళ్లాల్సి వుంది.

రోడ్డు నిర్మిస్తే సౌకర్యవంతం

కౌండిన్య నదిపై వంతెన నిర్మాణంతో పాటు ఏటి గడ్డ గ్రామం నుంచి మొసలి మడుగు గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపడితే నదికి ఇరువైపులా ఉన్న గ్రామాలకే కాకుండా, ఈ రోడ్డుకు ఇరువైపులా అనేక గ్రామాల ప్రజలకు, రైతులకు, పాలు డెయిరీల వాళ్లందరికీ ఈ రోడ్డు దగ్గరగా మరింత సౌకర్య వంతంగా అటు తమిళనాడుకు, ఇటు పలమనేరుకు వెళ్లేందుకు చాలా వరకూ రవాణాకు అనుకూలం గా ఉంటుంది. ప్రస్తుతం కుంచించుకు పోయిన దారిని సర్వే చేసి కొంత వెడల్పు చేసి ఏటి గడ్డ కాలనీతో పాటు నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల ప్రజలకు, రైతులకు రాకపోకల నిమిత్తం యానాది కాలనీ నుంచి మొసలి మడుగు గ్రామం వరకు ఈ దారిని సర్వే చేసి కొంత వెడల్పుగా చేసి కౌండిన్య నదిపై చెక్ డ్యాం నిర్మిస్తే తమకు అనుకూలంగా వుంటుందని పలువురు వాపోతున్నారు.

పాచిపట్టిన చెక్ డ్యాంపై వెళుతున్న ఏటిగడ్డ గ్రామవాసులు

ఇచ్చిన హామీ అమలు కాలేదు

మా గ్రామానికి ఎన్నికల సమయంలో ఎవరొచ్చినా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అడుగుతూనే ఉన్నాం.. కానీ 'మీకు అన్ని చేస్తాము' అని చెప్పి ఓట్లు వేయించుకుని వెలుతున్నారు. మళ్లీ ఐదేళ్ల వరకు ఎవరూ పట్టించుకోరు.. మా గ్రామాలకు బ్రిడ్జి నిర్మాణం చేసిన వాళ్లకు మేము ఓట్లు వేస్తాం.. ఏళ్ల తరబడి ఓట్లు వేయించుకుని వెళుతున్నారే తప్ప బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం లేదు..

- మల్లికమ్మ, ఏటి గడ్డ గ్రామం.

క్రైం న్యూస్

చోరీ ప్రదేశాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రెండు ఇళ్లలో చోరీ

ప్రజాశక్తి - రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారి పల్లి గ్రామపంచాయతీ ఫజులు పేటలో రెండు ఇళ్లలో శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. బాధితుల కథనం మేరకు..రొంపిచెర్ల మండలం, బొమ్మయ్య గారి పల్లి గ్రామపంచాయతీ, ఫజులు పేటకు చెందిన ధనంజయ ఇంటిలో 14 గ్రాముల బంగారు, రూ.20 వేల నగదు దొంగలు అపహరించారు. దీప ఇంటిలో రూ.10 వేలు డబ్బు, 1 గ్రాము బంగారు అపహరించారు. వీరి ఇళ్లకు తాళాలు వేసి ఉండడానికి గమనించిన దొంగలు రాత్రి సమయంలో తాళాలు తొలగించి దొంగతనానికి పాల్పడ్డారు. ఉదయాన్నే వెళ్ళి వారు ఇళ్ల వద్ద చూడగా అప్పటికే బీగాలు పగులగొట్టి ఉండడానికి గమనించారు. బంగారు, నగదు పోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, సిబ్బంది సంఘటన స్థలాన్ని సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతను అరెస్టుచేసి స్వాధీనం చేస్తున్న పోలీసులు

గంజాయి విక్రేత అరెస్టు

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న లింగేశ్వరి అలియాస్ జ్యోతి (45)ను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ కథనం మేరకు డీఎస్‌పి సయ్యద్ మహమ్మద్ అజీజ్ నేతృత్వంలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం అందిన రహస్య సమాచారం మేరకు ఓజీకుప్పం గ్రామంలో కాపుకాసిన పోలీసులు గంజాయి విక్రయిస్తుండగా లింగేశ్వరి అలియాస్ జ్యోతిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద విక్రయాలకు సిద్ధంగా ఉంచిన 1.25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ మహిళపై గతంలో నగరి, పుత్తూరు పోలీస్ స్టేషన్‌లో 5 గంజాయి విక్రయ కేసులు నమోదై వున్నాయని పోలీసులు తెలిపారు.

యోగా పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు

రాష్ట్ర యోగా పోటీలకు కుప్పం చిన్నారి తేజశ్రీ

ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కుప్పంకు చెందిన శ్యామల కృష్ణంరాజు కుమార్తె తేజశ్రీ ఎంపికైంది. కుప్పం బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తేజశ్రీ జిల్లాస్థాయి యోగా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానంలో నిలిచింది. ప్రభుత్వం తరపున నిర్వహించే క్రీడా పోటీల్లో తేజశ్రీ పాల్గొంటూ అండర్ 14 యోగ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 5వ తేదీ చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తుంబకుప్పంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో తేజశ్రీని రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక చేశారు. మూడోసారి రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొంటున్న తేజశ్రీ ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఉత్తమ చిన్నారి తల్లిదండ్రులతో, అధ్యాపకులు, స్థానికులు పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ చిన్నారిని పలువురు అభినందించారు.

నేటి నుండి గ్రామ కమిటీల సమావేశాలు

గుడిపల్లి మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణి

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో సోమవారం నుండి ఈనెల 14వ తేదీ వరకు టిడిపి సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు సుబ్రమణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఆదేశానుసారం ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని క్లస్టర్, యూనిట్, పంచాయతీ అధ్యక్షులు, బూత్ కమిటీ మెంబర్లు, పంచాయతీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పంచాయతీకి సమయం తెలిపామని ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించి అందరూ పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

కార్తిక వన మహోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

కార్తిక వన మహోత్సవం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కాణిపాకపట్నంలోని రిసార్టులో కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కమ్మవారి కార్తిక వనభోజన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. సంఘం తరపున ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇతర ప్రముఖులతో కలిసి 2026 కమ్మ వారి అభ్యుదయ సేవా సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తల్లిదండ్రులు శరజని, గురజాల చెన్నకేశవుల నాయుడులను ఘనంగా సత్కరించారు.

వర్ష బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే థామస్

అన్ని విధాలా ఆదుకుంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -కార్వేటినగరం : రాష్ట్ర ప్రభుత్వ విప్, జీడి నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చేతుల మీదుగా అన్నూరు పంచాయతీ పరిధిలోని చౌటూరులో ఇటీవల వర్షానికి ఇల్లు కోల్పోయిన జ్ఞానమ్మకు ఎమ్మెల్యే థామస్ రూ.50 వేలు రూపాయల చెక్కును ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ తరపున ఇంటి నిర్మాణానికి రెండు లక్షల 90 వేల రూపాయలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరు స్తుందన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి గతంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు వచ్చిపోయారని అభివృద్ధి లేదని, నేను ఎమ్మెల్యే అయ్యింది గంగాధర్ నెల్లూరు నియోజకవర్గన్ని అభివృద్ధి చేసి పరిశ్రమలు తెచ్చి యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. యువకులకు ఉద్యోగుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్ అన్ని విధాల కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్థులు ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ ఎం జనార్ధన్ రాజు, పార్టీ అధ్యక్షులు చెంగ్రాయల్ యాదవ్, ఎమ్మెల్యే సోదరులు రాజా ఎం మురళి కృష్ణ బాలాజీ అప్పలరాజు రుక్కుబాబు, పొద్దుటూరు రాజా, పలువురు పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

26 మంది కంటి శస్త్రచికిత్సకు ఎంపిక

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. మొత్తం 42 మంది రోగులు కంటి పరీక్షలకు హాజరు కాగా వారిలో 26 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. శిబిరంలో గతంలో కంటి శస్త్రచికిత్స చేయించుకున్న రోగులకు కంటి అద్దాలు అందించారు. ఎంపికైన రోగులకు ప్రసిద్ధ చెన్నై శంకర్ నేత్రాలయ హాస్పిటల్‌లో ఉచిత కంటి శస్త్రచికిత్సలు, ఉచిత ప్రయాణ సౌకర్యం, భోజనం, వసతి, మందులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శస్త్రచికిత్సలకు ఎంపికైన రోగులు, వారి సహాయకుల కోసం ఆదివారం మధ్యాహ్న భోజనం, తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టరు మురళీకృష్ణ, ఆర్ఎంపీ, పిఎంపి డాక్టర్లు శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

వార్డుల వారీ వైసీపీ కమిటీలు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాల్టీ పరిధిలో వార్డుల వారీగా వైసిపి నూతన కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఆదివారం 11, 12, 14, 15, 25 వార్డులకు సంబంధించి నూతన కమిటీలను మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు హఫీజ్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. 11వ వార్డు అధ్యక్షుడిగా మాధవన్, 12 వార్డు మోహన్, 14 వార్డు మునెప్ప, 15 వార్డు బాలాజీ, 25 వ వార్డు గోవింద్‌ను ఎన్నుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్సీ, కుప్పం వైసిపి ఇన్చార్జి భరత్ ఆదేశాల నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో నూతన కమిటీలను నియమిస్తున్నట్లు హఫీజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్టీ ఉపాధ్యక్షులు మునిరాజు, మోహన్ రామ్ , కౌన్సిలర్లు, మణి, రాజ్ కుమార్, నాగరాజు, నాయకులు సీకేసి, మూర్తి, జయ గోపి, ప్రభాకర్ , చిన్న,శివ, వైసిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మునివెంకటప్పకు నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

రెస్కో డైరెక్టర్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు, రెస్కో డైరెక్టర్ సతీష్ తండ్రి మునివెంకటప్ప ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న టిడిపి నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, క్లస్టర్ ఇంచార్జ్ రవి రెడ్డి, కడ సభ్యుడు రఘు, నవీన్, చంద్రశేఖర్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, మురళీధర్, గిరి, సురేష్, కే. వెంకటరమణ, దివాకర్ పాల్గొన్నారు.

12న ర్యాలీని జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డాక్టరు సునీల్‌కుమార్

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఈ నెల12వ తేదీ నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని పూతల పట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ముంగరమడుగు కోటి సంతకాల సేకరణపై ఈనెల 12న పూతలపట్టు నియోజక వర్గంలో నిర్వహించే ర్యాలీకి సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ గ్రామస్తు లు స్వచ్ఛందంగా సంతకాలు చేసే ప్రజా ఉద్యమానికి తమ మద్దతు తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయక విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించక విద్యార్థులను కళాశాలకు వెళ్లనీయకుండా చేస్తున్నారన్నారు. నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు ఈ ఉద్యమం ఎంతో తోడ్పడుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో మండల , మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి, రాష్ట్ర పాల ఏకరి విభాగం అధ్యక్షులు ఎంబి కుమార్ రాజా, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మెన్ దత్తాత్రేయ రెడ్డి, నాయకులు ప్రకాష్ రెడ్డి, థామస్, కిషోర్ కుమార్ రెడ్డి, నాగరాజా, గజేంద్ర, శైలేష్ బాబు, మహేంద్ర, భాష్యం లోకేష్ నాయుడు,కిరణ్ ఖాదర్, చిన్నా, చంద్ర, రవి, సోము పాల్గొన్నారు.

కుప్పం: కూటమి ప్రభుత్వం ఏపీలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన వైసీపీ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. కుప్పం వైసిపి కార్యాలయంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే నిరుపేద మధ్యతరగతి విద్యార్థులకు తీరని అన్యాయం చేసిన వారవుతారని దీన్ని వైసిపి పూర్తిగా వ్యతిరేకిస్తాం దన్నారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటామని అవసరమైతే ప్రజా ఉద్యమం చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, మండల అధ్యక్షులు హెచ్ఎం మురుగేష్, బాబు రెడ్డి, సర్పంచ్ భాస్కర్ నాయక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసులు

ఎమ్మెల్యే దృష్టికి గోపిశెట్టిపల్లి సమస్యలు

ప్రజాశక్తి -కార్వేటినగరం : మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి లోని డ్రైనేజ్ కాలువలు, సిసి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు టిడిపి యువ నాయకుడు ప్రొద్దుటూరు రాజా వివరించారు. గోపి శెట్టిపల్లి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే స్పందించి గోపిశెట్టిపల్లి రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు రాజా పలువురు పాల్గొన్నారు. గెపి



ఎమ్మెల్యేను కలిసిన టిడిపి యువనాయకులు ప్రొద్దుటూరు రాజా

దుర్గామాత ఆలయ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -వి కోట.: మండల కేంద్రమైన వికోటలోని దుర్గామాత ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైంది. స్థానిక దుర్గామాత ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు పుర ప్రముఖుల సమక్షంలో నూతన పాలకవర్గ ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షులుగా జి రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, ఎంపికయ్యారు. ఆలయం వద్ద జరిగిన కమిటీ సుదీర్ఘ సమావేశంలో ఇటీవల ముగిసిన 14 వ దసరా ఉత్సవాల ఆదాయ, వ్యయాలను ఈ సమావేశంలో తెలిపారు. దీంతోపాటు పాటు భవిష్యత్ కార్యాచరణపై కమిటీ సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని అందరూ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దుర్గామాత ఆలయ నూతన ప్రధాన కార్యదర్శిగా వి జగన్మోహన్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా రమేష్ బాబు, జనార్ధన్, బాలు, కోశాధికారిగా తుకారాం ఇతర కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, రామ చంద్ర నాయుడు, రంగనాథ్, ఆనంద్ రెడ్డి, దవనం భక్త, మాజీ ధర్మకర్తలు దామోదర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు, రిటైర్ఎంపీడీవో రమేష్ బాబు, కమల్ రాజు, చలం రాజు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గామాతా ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మానిటరింగ్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం నియోజకవర్గ ఎస్సీ ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గా ఎన్నికైన జయశంకర్, కృష్ణా నాయక్‌లను ఆదివారం కూటమి నేతలు ఘనంగా సన్మానించారు. ఉన్సిగానిపల్లిలో దుశ్శాలు వాలు, పూలమాలలు వేసి ఘనంగా అభినందనలు తెలిపారు. మండలంలో ఎస్సీ ,ఎస్టీల అగ్రవర్ణ కులాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్లు రామ్మూర్తి, శ్రీనివాసులు రెడ్డి, మనీష్ ,సుభాష్, మహేంద్ర నాయుడు, బీరప్ప గౌడు, షణ్ముగం, మంజునాథ చారి, కృష్ణారెడ్డి, కేశవులు, గోపాల్ రెడ్డి, రామలింగం పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

రసవత్తరంగా సౌత్ జోన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల మండలంలోని జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. టోర్నమెంట్ నిర్వాహకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు నుంచి 36 టీంలు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. క్వార్టర్ ఫైనల్ కు 8 జట్లు ఎంపికైనట్లు తెలిపారు. తమిళనాడుకు చెందిన రెండు చెట్లు, నెల్లూరు జట్టు, కాకినాడ జట్టు, నంద్యాల జట్టు, హైదరాబాద్ జట్టు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నుంచి ఒక చెట్టు, వేలూరు నుంచి ఒక చెట్టు సెమీ ఫైనల్స్ కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను వీక్షించేందుకు పలువురు క్రీడాకారులు, ప్రేక్షకులు హాజరయ్యారు.